క్లుప్తంగా

టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ నర్సింహులుకు సన్మానం

నల్లగొండ : టీజీ ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా గురువారం నల్లగొండ ఎస్ఈ కార్యాలయానికి వచ్చిన నర్సింహులుకు 1104 సంఘం కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మచెట్ల వెంకటయ్య ఆధ్వర్యంలో ఘన యూనియన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నర్సింహులుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు 'చలో సెక్రటేరియట్'

నల్లగొండ టౌన్ : జాబ్ క్యాలెండర్ అమలు చేసి రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4వ తేదీన తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమంలో యువత పాల్గొని జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుండాల నరేష్, గద్దపాటి సుధాకర్, మారుపాక కిరణ్, సాయి, కార్తీక్ పాల్గొన్నారు.

మునుగోడు: నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న చలో సెక్రటేరియట్‌కు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి కోరారు. గురువారం మునుగోడులో జరిగిన డీవైఎఫ్ఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మిర్యాల భరత్, బొడ్డుపల్లి నరేష్, యాసరాని వంశీకృష్ణ, యాట శ్రీకాంత్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు మృతి


వీరయ్య(ఫైల్)

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నేత తండు వీరయ్య(85) అనారోగ్యంతో కన్నుమూశారు. వీరయ్య తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీలో పని చేశారు. వీరయ్య మృతదేహాన్ని గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, కందాల పమీల, చారకొండ వెంకగౌడ్, బచ్చుపల్లి ప్రకాష్‌రావు, వంటిపాక కృష్ణ, కొప్పుల అంజయ్య, దోరెపల్లి ఎల్లయ్య, బచ్చుపల్లి లక్ష్మణ్‌రావు, బొస్కు యేసు, మేడి వెంకటయ్య పాల్గొన్నారు.

ప్లాట్లు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల వినాయక హౌసింగ్ బోర్డులో తమకు ప్లాట్లు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బాధితులు గురువారం హౌసింగ్ బోర్డు అధికారులకు వినతి పత్రం అందజేశారు. హౌసింగ్ బోర్డు వారు 2011వ సంవత్సరంలో ప్లాట్లు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు తీసుకుని ఇప్పటి వరకు ఇళ్లు నిర్మించకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. వేలం వేయడానికి వచ్చిన అధికారులను అడ్డుకుని తమకు న్యాయం చేసేంతవరకు ప్లాట్లు వేలం వేయనీయబోమని అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో బాధితులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్


నకిరేకల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత

నకిరేకల్ : దేశాభివృద్ధిలో మున్సిపాలిటీల పాత్ర అనే అంశంపై హర్యానా రాష్ట్రంలోని గురుగ్రామ్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి మున్సిపల్ చైర్మన్ల సదస్సులో నకిరేకల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ నకిరేకల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఆమెతోపాటు తెలంగాణ రాష్ట్రం నుంచి కొత్తూరు, సిద్దిపేట, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్లు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయించొద్దు

తిప్పర్తి: ఫర్టిలైజర్ డీలర్లు ఎరువులు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ హెచ్చరించారు. గురువారం తిప్పర్తి మండలంలోని దుప్పలపల్లి గ్రామంలో ఎన్‌డీసీఎంఎస్ ఎరువుల దుకాణాన్ని సందర్శించి స్టాక్‌ను రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట ఏఓ సన్నిరాజు, ఏఈఓ రజిత ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

కేతేపల్లి: ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని కేతేపల్లి ఏఓ బి.పురుషోత్తం సూచించారు. కేతేపల్లి, కొండకిందిగూడెం, ఇనుపాముల గ్రామాల్లోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయ దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయా దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదు ఇవ్వాలన్నారు.


కేతేపల్లి : గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఏఓ

అర్ధాకలితో పారిశుద్ధ్య కార్మికులు !

- గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా అందని వేతనాలు
- పనులు చెప్పలేకపోతున్న కార్యదర్శులు


పైప్‌లైన్ వేస్తున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

గట్టుప్పల్ : పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపరుస్తూ చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఉదయం మొదలు రాత్రి వరకు గ్రామాల్లో వీధులను, మురుగు కాల్వలను శుభ్రం చేసి ఇంటికి వస్తే ఒక్క పూట భోజనం కూడా లేని పరిస్థితి. చండూరు, గట్టుప్పల్ మండలాల్లోని గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలు (ఏప్రిల్, మే, జూన్) గా వేతనాలు అందడం లేదు. పిల్లల చదువులకు, కుటుంబ నిర్వహణకు బయట అప్పులు చేసి కార్మికులు కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. గతంలో ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికులకు బ్యాంకు అకౌంట్‌లలో ప్రతినెలా వేతనాలు జమ చేస్తామనే హామీ ఇచ్చింది. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెల వరకు వేతనాలు అందజేశారు. అనంతరం వేతనాలు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

121 మంది కార్మికులు ..

చండూరు మండల పరిధిలో 19 గ్రామ పంచాయతీలకు గాను 80 మంది కార్మికులు, గట్టుప్పల్ మండల పరిధిలో 7 గ్రామాలకు గాను 41 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లోఉన్నాయి. ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ద్వారా కొన్ని నెలలు కార్మికులకు వేతనాలు అందించింది. మార్చి నెల వరకు గ్రామ పంచాయతీ నిధుల నుంచి కార్మికులకు వేతనాలు అందించారు. గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు అందుతాయని, గ్రామ పంచాయతీ నిధుల నుంచి వేతనాలు అందజేయలేమని అధికారులు చెబున్నారు. ప్రతి నెలా కార్మికులకు వేతనాలు అందజేయకపోవడంతో వీరికి పనులు చెప్పేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు తటపటాయిస్తున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని వేతనాలు ప్రతినెలా తమ బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

ప్రతి నెలా వేతనాలు అందిస్తామన్నారు



"ప్రతి నెలా గ్రీన్ చానల్ ద్వారా వేతనాలను బ్యాంకులో కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం చెప్పి కొన్ని నెలలు జమ చేశారు. మూడు నెలలుగా వేతనాలు బకాయిలు ఉన్నాయి. ప్రతినెలా మా వేతనాలు బ్యాంకులో జమ చేయాలి. వేతనాలు పెండింగ్ పడితే మాకు పూట గడవడం ఎలా. అధికారులు స్పందించి నెలనెలా వేతనాలు వచ్చేలా చూడాలి.

– ఏర్పుల సైదులు, పంచాయతీ కార్మికుడు, గట్టుప్పల్

పనులు చెప్పలేకపోతున్నాం



"కార్మికులకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన వేతనాలు బకాయి ఉన్నాయి. నెలనెలా వేతనాలు అందకపోవడంతో కార్మికులకు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చెప్పలేకపోతున్నాం. గ్రామపంచాయతీ నుంచి కార్మికులకు వేతనాలు ఇవ్వకూడదనే నిబంధనలు ఉన్నాయి. ప్రభుత్వమే నేరుగా గ్రీన్ చానల్ ద్వారా కార్మికులు అకౌంట్లలో జమ చేస్తుంది. ప్రతి నెలా కార్మికులకు వేతనాలు అందితే గ్రామాల్లో పనులు వేగంగా ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటాం.

-ఎండీ షఫీ, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


చిట్యాల : ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు అవగాహన పెంచుకుని ఎక్కడికక్కడే పరిష్కరించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. చిట్యాల ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు ఎందుకు రావడం లేదని, నీటి సరఫరా కోసం తవ్విన సీసీ రోడ్లకు మరమ్మతులు ఇప్పటి వరకు ఎందుకు చేయడం లేదని మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులకు సూచించారు. విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. చిట్యాల మండలంలోని గ్రామాల్లో 384 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, త్వరలోనే ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గంజాయి రహిత మండలంగా మార్చేందుకు అధికారులతో పాటు ప్రజలంతా సహకరించాలని కోరారు. అనంతరం అక్కడికి వచ్చిన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఆర్ పి.జయలక్ష్మి, తహసీల్దార్ జి.కృష్ణ నాయక్, సీఐ కె.నాగరాజు, ఎస్ఐ ఎం.రవికుమార్, ఏఓ గిరిబాబు, డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

నార్కట్‌పల్లి : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఉమేష్, సీఐ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐత రాజు యాదయ్య , వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలి


మునుగోడు : మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

మునుగోడు: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను వినియోగించడం పూర్తిగా మానుకోవాలని పర్యావరణవేత్త సురేష్ గుప్తా కోరారు. గురువారం ప్రపంచ ప్లాస్టిక్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మునుగోడు మండల కేంద్రంలో విద్యార్థులు, అధికారులు భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురేష్ గుప్తా పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగించకుండా జూట్ బ్యాగులు మాత్రమే వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ భాస్కర్, మండల పంచాయతీ అధికారి స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలి

కేతేపల్లి: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని కేతేపల్లి తహసీల్దారు రమాదేవి కోరారు. ప్రపంచ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ నివారణ–పర్యావరణ పరిరక్షణ అనే నినాదంతో గురువారం కేతేపల్లిలోని డీపాల్ పాఠశాల విద్యార్థులతో అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి ముప్పు ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, డీటీ ఎంఏ.సత్తార్, ఆర్ఐ వెంకన్న, పాఠశాల ప్రిన్సిపాల్ సాజి నారికల్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

చండూరు : ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా చండూరును తీర్చిదిద్దుదామని, అందుకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ మేనేజర్ అరుణకుమారి కోరారు. ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా గురువారం చండూరులో వ్యాపార సముదాయాల్లో, జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ బ్యాగులు వాడొద్దని, జూట్ బ్యాగులు, పేపర్ బ్యాగులు వాడాలని ఆయన సూచించారు. విద్యార్థులకు క్లీన్ హ్యాండ్స్ కార్యక్రమం నిర్వహించి ప్లాస్టిక్ రహిత సమాజానికి పాటుపడాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్యాధికారి రాజు, వార్డు అధికారులు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అరవింద్, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలెం వాసికి భారత్ సేవా విభూషణ్ అవార్డు


బెల్లి జనార్దన్

నకిరేకల్: మండలంలోని పాలెం గ్రామానికి చెందిన బెల్లి జనార్దన్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించిన ఏపీలోని వైఎస్సార్ కడప జిల్లా మనం ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ డాక్టర్ కె.చక్రవర్తి భారత్ సేవా విభూషణ్ అవార్డు ప్రకటించారు. బెల్లి సాయిలు–చంద్రమ్మ దంపతుల చిన్న కుమారుడు బెల్లి జనార్దన్. జనార్దన్ గతంలో కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో బహుమతులు పొందాడు. 1996 అక్టోబర్‌లో ఈఎం ఈఈకోర్‌లో సోల్జర్స్ టెక్నికల్‌గా చేరారు. ఆపరేషన్ విజయ్, ఆపరేషన్ రక్షక్ లాంటి సైనిక ఆపరేషన్లలో పాల్గొని దేశ సేవ చేశారు. ఈఎం సెంటర్‌లో ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తూ ఎన్నో అవార్డులు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మోటివేషన్ క్లాసులు ఇచ్చారు. వినాయక చవితి సందర్భంగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. సినిమా ప్రొడ్యూసర్‌గా, నటుడిగా పోలీసు వారి హెచ్చరిక అనే సినిమా ద్వారా సినీ రంగ ప్రవేశం చేశారు.

13న కాళికామాత బోనాలు

నకిరేకల్ : పట్టణంలోని సంతోష్‌నగర్‌లో గల శ్రీ స్వయంభు కాళికామాత ఆలయంలో ఈ నెల 13వ తేదీన ఆదివారం ఆషాఢ మాసం బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఆలయంలో నిర్వహించిన ఆలయ కమిటీ సమావేశంలో బోనాల వేడుకలపై తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మదేవర రవి శంకర్, ఆలయ కమిటీ ప్రతినిధులు దీకొండ ప్రకాష్, కొండేటి శ్రీను, ఉయ్యాల శ్రీనివాస్, ఊర శ్రీను, వేణుమాధవ్, మారుతీ నాగయ్య, అంబేద్కర్, దాసరి రామచంద్రయ్య, పల్లేర్ల యాదగిరి, మేడిపల్లి శివ, కారింగుల యాదగిరి, కుక్కడపు గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించండి


కేతేపల్లి : శిక్షణ ఇస్తున్న వెంకటేశ్వర్లు

కేతేపల్లి: తప్పులు లేకుండా ఓటరు జాబితాలను రూపొందించాలని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో జి.వెంకటేశ్వర్లు బీఎల్ఓలకు సూచించారు. గురువారం కేతేపల్లిలోని రైతు వేదిక భవనంలో ఓటరు జాబితా రూపకల్పనపై బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం–6 ద్వారా ఓటుహక్కు నమోదు చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన ఓటర్లను ఓటరు జాబితాలో చేర్చి, మృతి చెందిన ఓటర్లు, డబుల్ ఓటర్లుగా నమోదైన వారిని తొలగించాలన్నారు. ఒక కుటుంబంలోని సభ్యుల ఓట్లన్నీ ఒకే వార్డులో వరుస క్రమంలో వచ్చే విధంగా ఓటరు జాబితా రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో కేతేపల్లి తహసీల్దారు రమాదేవి, డీటీ ఎంఏ.సత్తార్, ఆర్ఐ వెంకన్న, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై దృష్టి సారించండి

చండూరు : ఓటరు జాబితా సవరణపై దృష్టి పెట్టాలని చండూరు ఆర్డీఓ శ్రీదేవి బూత్ లెవెల్ ఆఫీసర్లకు సూచించారు. గురువారం చండూరు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన బూత్ లెవెల్ ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన వారి నుంచి ఫామ్ 6 స్వీకరించి ఓటర్లుగా నమోదు చేయాలని, చనిపోయిన వారిని ఫామ్ 7 ద్వారా తొలగించాలని, ఫామ్ 8 ద్వారా ఇతర ప్రాంతాకు వెళ్లిన వారి ఓటు అడ్రస్ మార్పు చేసుకోవచ్చని సూచించారు. అర్హులు ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, మాస్టర్ ట్రైనర్లు మాదగోని వెంకటేశ్వర్లుగౌడ్, డి.బాలాజీ, రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కట్టంగూర్ : ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం ఈ నెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కట్టంగూర్ మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సీఐటీయూ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చింతపల్లి బయ్యన్న, పెంజర్ల సైదులు, జిట్ట నగేష్, ఆదిమల్ల సుధీర్, వంటిపాక వెంకటేశ్వర్లు, పొన్న అంజయ్య, చెరుకు జానకి, లింగయ్య, స్వామి పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

రామగిరి(నల్లగొండ): ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోలె సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును నల్లగొండ ఏపీఎం కార్యాలయంలో గురువారం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లపల్లి మంగ, కాసర్ల సువర్ణ పాల్గొన్నారు.

మర్రిగూడ: కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక చర్యలను అవలంబించడాన్ని నిరసిస్తూ ఈ నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం పిలుపునిచ్చారు. గురువారం మర్రిగూడ మండలంలోని మేటిచందాపురం పరిధిలో గల ఇందుర్తి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, ఏరుకొండ రాఘవేంద్ర, వెంకటయ్య, భద్రి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నల్లగొండ టౌన్ : అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్డులోని అన్నేశ్వరమ్మ గుట్ట సర్వే నంబర్ 33లో ప్రభుత్వ భూమి ఉందని, ఆ ప్రదేశంలో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేశారు. లెనిన్, మదార్, సుజాత, విజయ, ధనలక్ష్మి, అక్కలయ్య, యూసుఫ్, శంకర్, యేసు, మల్లేష్, లింగయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసిన విద్యార్థులు


కార్యాలయానికి తాళం వేస్తున్న విద్యార్థులు

నార్కట్‌పల్లి : ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.7,500 కోట్లు వెంటనే చెల్లించాలి బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీరాందేవ్ డిమాండ్ చేశారు. గురువారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని విద్యార్థులు ముట్టడించి కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోదీరాందేవ్ మాట్లాడుతూ విద్యార్థులకు రావాలిసిన ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని, నార్కట్‌పల్లి మండల కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించి సొంత భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఎడ్ల మహాలింగం, కావటి సత్యనారాయణ, మల్లేష్, శిరీష, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల తనిఖీ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి నేతృత్వంతో గురువారం తనిఖీ చేశారు. త్రీమెన్ కమిటీ సభ్యులు ఎంఈఓ అరుంధతి, ఏఎంఓ ఆర్.రామచంద్రయ్య, ఎఫ్ఏఓ సీహెచ్.యోగేంద్రచారి ఆధ్వర్యంలో గొల్లగూడ, పానగల్లు, దేవరకొండ రోడ్డు, హైదరాబాద్ రోడ్డులోని పలు పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలో అనుమతి లేని పాఠశాలలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ నాయకులు గురువారం డీఈఓ భిక్షపతికి వినతి పత్రం అందజేశారు. దాదాపు 60 శాతం పాఠశాలలు భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, అగ్నిమాపక శాఖ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోకుండానే పాఠశాలలు నడుపుతున్నట్లు వివరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్, అంబటి ప్రణీత్, శివప్రసాద్, జాన్ ప్రేమ్, రమేష్, బాలాజీనాయక్, మధు, భరత్ తదితరులు ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

రామగిరి(నల్లగొండ): అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ డిమాండ్ చేశారు. నల్లగొండలోని సంఘం జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మౌలిక వసతులు ఏర్పాటు చేయకుండా కనీసం క్రీడా ప్రాంగణం లేక కమర్షియల్ కాంప్లెక్స్‌లలో ప్రైవేట్ పాఠశాలలు నడుపుతున్నారని, ఆయా పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కొండేటి నరేష్‌కుమార్, కందుల విజయ్‌కుమార్, బుకారెడ్డి, సింగారం అజయ్‌కుమార్, బాకీ తరుణ్, అల్లంపల్లి కొండన్న, వినోద్‌చారి, యశ్వంత్, చరణ్, మారేపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ వెంకయ్య

మునుగోడు: వర్షాకాలంలో విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురికాకుండా హాస్టల్, తరగతి గదుల చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య సూచించారు. గురువారం మునుగోడులోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఏ రోజు రికార్డులు అదే రోజు నమోదు చేసి ఉంచాలని, విధుల పట్ల ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ విజయ భాస్కర్, మండల పంచాయతీ అధికారి స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: రాష్ట్రంలో పేదప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఈ నెల 14న తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో జరుగనున్న బహిరంగ సభను విజయవంతం చేసేందుకు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మార్కెట్‌కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కార్యదర్శి గూని వెంకటయ్య, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గణేశ్, పాల్గొన్నారు.

రామనర్సింహారెడ్డికి నివాళి


నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాల: మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన కర్నాటి రామనర్సింహారెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి రామనర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి సోదరులు ఉప్పల వెంకట్‌రెడ్డి, చెన్నారెడ్డిలను పరామర్శించారు. ఆయన వెంట గుత్తా యువసేన అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

టై, బెల్టులు పంపిణీ

నకిరేకల్ : పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో నానా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం 150 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం కోదాటి రాములు అన్నారు. ఈ కార్యక్రమంలో నానా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు యాతాకుల శేఖర్, బహుజన మహాసభ జిల్లా అధ్యక్షుడు చెట్టిపల్లి కాశీరాం, బొల్లికొండ లింగయ్య , సేవా సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తొండల్‌వాయి ప్రాథమిక పాఠశాలలో..

నార్కట్‌పల్లి : మండలంలోని తొండల్‌వాయి గ్రామానికి చెందిన స్నేహితులు చింత విక్రమ్, చింత శంకర్, చిన్నపాక సుధాకర్ గురువారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బెల్టులు, టైలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చింత రామ్, రాంబాబు, ఉదయ్, రఘు, వంశీ, బన్నీ, ఎడమ రామ్ తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు వేడుక


గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు

నకిరేకల్: ఆషాఢ మాసం సందర్భంగా నకిరేకల్‌లోని వాసవి నగర్‌లో కిట్టి గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం గోరింటాకు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలంతా ఒక వేదిక వద్దకు చేరుకుని గోరింటాకు పెట్టుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ వేడుకల్లో కందాల శోభ, కడారి అనిత, ముసుకు కవిత, గోలి మంజుల, మూడుదుడ్ల పద్మ, అరుణ, ఇందిర, అంజలి, పద్మ, కమలజ, పుష్ప, సత్యవతి, రమా, లలిత, రేణుక, కవిత గీత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందిని మినహాయించాలి

నల్లగొండ టౌన్ : అంగన్‌వాడీ సిబ్బందిని బీఎల్ఓ విధుల నుంచి మినహాయించాలని కోరుతూ గురువారం జిల్లా పరిషత్‌లో బీఎల్ఓలకు శిక్షణ ఇస్తున్న అధికారికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట రవీందర్ వినతిపత్రం అందజేశారు. అద్దంకి నర్సింహ, పోలె సత్యనారాయణ, పి.సరిత, కె.సునంద, పాతూరి లక్ష్మి, ప్రకృతాంబ, రేణుక, నాగమణి, నాగలక్ష్మి, మనీషా, బాలజ్యోతి, భారతి పాల్గొన్నారు.